

ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఎంఇఒ-1లుగా నియమించడం పై ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి పాఠశాల విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని జె. కొత్తపల్లి జిల్లా పరిషత్ మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మేకల శివార్జున, ఆకుమళ్ల రాజబాబు,(టిటియుఎపి) రామచంద్రారెడ్డి (ఎపిటిఎఫ్) మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే పాఠశాల సహాయకులకు, ఎంత జూనియర్ అయినప్పటికీ వారిని ఎంఇఒ-1 గా నియమించడం దురదృష్టకమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా కమిషన్ కలుగజేసుకొని వారిని వెంటనే వెనక్కి పంపించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, అబ్దుల్ అజీజ్,శంకర్ రెడ్డి, వెంకటసుబ్బయ్య,సునీత, లతా,వందన పాల్గొన్నారు.

'గండికోట' పరిహారానికి మోక్షమెప్పుడో!



జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కేటాయింపుల ఊసేది

కాగితాల్లోనే తెలుగుగంగ లీకేజీ ప్రతిపాదనలు

కదలని సర్వారాయసాగర్ పనులు

నేడు జమ్మలమడుగుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

కడప జిల్లా అపరిష్కృత సమస్యలకు నిలయంగా మారింది. గండికోట, పైడిపాలెం, సోమశిల సాగునీటి ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అపరిష్కృత సమస్యగా తలపిస్తోంది. ఎన్‌హెచ్ రహదారులకు కేటాయించిన భూములకు పరిహారం చెల్లింపుల సమస్య తొద్దింది. జిల్లాలో ఫ్రీహోల్డ్ భూముల పందేరంలో చేతివాటం, పారిశ్రామిక ప్రగతి మౌలిక సదుపాయాల కొరత వెరసి జిల్లా అభివృద్ధి తిరోగమన బాటలో నడుస్తోంది. దేశంలోని భూగర్భ బేసిన్‌లో తనదైన ప్రత్యేకత కలిగిన జిల్లాలో పారిశ్రామిక ప్రగతి వెలవెలబోతోంది. కూటమి సర్కారు నాయకుల దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన పారిశ్రామిక సంస్థలకు రాజకీయ చిత్తశుద్ధి కొరవడిన ఫలితంగా సాకారానికి నోచుకోవడం లేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జమ్మలమడుగు నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో కథనం...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెతను తలపిస్తోంది. వ్యవసాయ, సాగునీటి, పారిశ్రామిక రంగాల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కిస్తాన్న హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తానని హామీ దశాబ్దాలుగా నీరోడుతోంది. హామీల అమలుకుతోడు మేలో నిర్వహించిన టిడిపి మహానాడులో జిఎన్ ఎస్ఎస్ కెనాల్ పనులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానన్న హామీ అమలుకు నోచుకోలేదు. జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లపల్లిలో ఉక్కు పరిశ్రమ పనులు చేపడతామని ఇచ్చిన హామీ మూడు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో పట్టాలకు ఎక్కిన దాఖలాల్లేవు. తాజాగా ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉందనే వాతావరణంలో వాణిజ్య, పరిశ్రమల శాఖ ఉక్కు పరిశ్రమ పనుల ప్రణాళికను ప్రకటించడం మినహా ఎటువంటి పురోగతి కనిపించలేదు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు గత సర్కారు పెంచిన రూ.2.50 లక్షలు పరిహారం ఆరేళ్లుగా అమలుకు నోచుకోలేదు.

ఎంఎస్ఎంఇ ప్రోత్సాహకాలేవీ

జిల్లాలోని ఎంఎస్ఎంఇ పరిశ్రమలు ప్రోత్సాహకాలకు నోచుకోవడం లేదు. జిల్లాలో వేలాది ఆయా పరిశ్రమలు సర్వే చేసిన సంగతి తెలిసిందే. వాటిలో పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న సంగతి తెలిసిందే. వీటికి ఇవ్వాల్సిన సుమారు రూ.మూడు కోట్ల ప్రోత్సాహకాలను మంజూరు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

జిల్లాలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు పడకేసింది. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దు చేసినప్పటి నుంచి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో భాగమైన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. సర్వారాయసాగర్, వామికొండ రిజర్వాయర్ పెండింగ్ పనులు, తెలుగుగంగ కాల్వ, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ లీకేజీ వ్యవహారం కొనసాగుతూనే ఉంది.

పట్టాలెక్కని జాతీయ రహదారులు


రాయచోటి-చాగలమర్రి జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రశ్నార్థకంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. దశాబ్దాలుగా కడప-తిరుపతి జాతీయ రహదారి సర్వే దశలో కునారిల్లుతోంది. ఇటీవల తెరపైకి వచ్చిన కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు.

పరిహారం..పరిహాసం

ఎన్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. గ్రీవెన్స్‌సెల్ మొదలుకుని స్పందన, ప్రజాసమస్యల పరిష్కార వేదిక చుట్టూ దశాబ్దాల తరబడి తిరుగుతున్నప్పకీ పరిష్కారం కావడంలేదు. బెంగళూరు-విజయవాడ, రాయచోటి-వేంపల్లి- చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఇలా..

ప్రజాశక్తి- కడప అర్బన్



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 1న జమ్మలమడుగు మండలంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మండలంలోని గూడెం చెరువు గ్రామంలో లబ్దిదారు గృహానికి వెళ్లి పించన్ల పంపిణీ చేశారు. అనంతరం నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో స్థానిక నేతలతో భేటీ అవుతారు. గండికోటలో పలు అభివృధి, ప్రారంభోత్సవాలు చేస్తారు. ఉదయం ప్రత్యేక విమానంలో బయలుదేరి కడప విమానాశ్రయానికి 11.45 గంటలకు చేరుకుంటారు. 11.55గం లకు హెలిక్యాప్టరులో బయల్దేరి మధ్యాహ్నం 12.15కు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోనీ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. ఆయనకు అక్కడ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికిన తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గాన 12.25గంటలకు గూడెంచెరువుకు చేరుకుంటారు. 12.45 వరకు ఎన్టీఆర్ భరోసా పించన్లను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిస్తారు. 12.50 గంటలకు గూడెంచెరువులోని ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. 2 గంటల వరకు ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. తిరిగి 2.35 గంటలకు నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాల్ చేరుకుని స్థానిక కేడర్ నేతలతో సమావేశమవుతారు. జమ్మలమడుగు హెలిపాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి 3.45 గంటలకు కు హెలిక్యాప్టరులో బయల్దేరి 3.55 గంటలకు గండికోట హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. 4 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 4.05 గంటలకి గండికోట వద్దకు చేరుకుంటారు.. అక్కడ ఒబెరాయ్ హోటల్, జార్జ్ వ్యూ పాయింట్, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4:35 గంటల నుంచి 5:25 గంటల వరకు జెకె రిసార్ట్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్టేక్ హోల్డర్స్, ప్రాజెక్టు డెవలపర్లతో సమావేశం నిర్వహిస్తారు. 5.30 గంటలకు గండికోటలో బయల్దేరి 5.50కి కడప విమానాశ్రయం చేరుకుంటారు. 6 గంటలకు కడప నుంచి బయలుదేరి 6:40కి గన్నవరం బయలుదేరుతారు.

సర్వాంగ సుందరంగా గండికోట టూరిజం

- మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

పర్యాటకంగా గండికోటను సర్వాంగ సుందరంగా నిర్మించబోతున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం గండికోటలో జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అమెరికాలో గ్రాండ్ కెన్యాన్ కంటే అందమైన సహజ సౌందర్యం గల లోయ గండికోటలో ఉందన్నారు. సాస్కి వారి ఆధ్వర్యంలో 77. 91 కోట్లతో శంకుస్థాపనకు చేయనున్నారు. అద్భుత వారసత్వ సంపద గండికోటకు సొంతం అన్నారు. పర్యాటకులు వచ్చి రెండు రోజులు పాటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టూరిజం పాలసీతో పాటు పెట్టుబడిదారులను ఆకర్షిస్తూ అభివృద్ధి పరుచుతామన్నారు. ఇన్‌ఛార్జి మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమా లుంటాయన్నారు.

అనంతరం మంత్రులు టూరిజం ఎమ్‌డి అమ్రపాలికాటతో కలసి సభా స్థలితోపాటు గండికోటలోని జుమ్మా మసదు, ధాన్యాగారం, పెన్నాలోయ, వ్యూ పాయింట్ తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ శాస్కి స్కీమ్ ద్వారా మంజూరైన రూ.77.91 కోట్లతో గండికోట పర్యాటక ప్రాజెక్టు పనులకు సిఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఇంకా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. గండికోట పర్యాటక ప్రాంతానికి సమీపంలో ఒబెరాయ్ గ్రూప్ 5 స్టార్ హోటల్ పెట్టేందుకు ముందుకు వచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా : ఫ్యాప్టో



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి - బద్వేలు

విద్యా రంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 2న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ పిలుపు మేరక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, హెచ్ఎంఎ జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం బద్వేల్‌లోని స్థానిక ఎంఆర్‌సి వద్ద ఫ్యాప్టో బద్వేలు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలనిచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటుపడతామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పెద్దలు విద్యారంగంపై పలు ప్రయోగాలను చేస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేద, బడుగు, బలహీన వర్గాలు విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో పాలకుల విధానాల ఫలితంగా విద్యా బోధన కరువైందని, ఉపాధ్యాయులను అనునిత్యం బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకే ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నదని ఆరోపించారు. తక్షణం పిఆర్‌సిని ఏర్పాటు చేయాలని, అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎ ల చెల్లింపులకు తక్షణం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అంతర్ జిల్లా బదిలీలను నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని, పరీక్షలు తెలుగులో కూడా రాసేందుకు అవకాశం కల్పించాలని వారు కోరారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు గంజి పెంచలయ్య, టి.శివప్రసాద్, కె.సుధాకర్, ఎం.సుబ్బరాయుడు, ఎస్.దేవానందం, సి.కంచిరెడ్డి, పి.చంద్రశేఖర్ యాదవ్, ఎస్.మస్తాన్ వలి, ఎన్.పవన్ కుమార్, ఎస్.బాలయ్య, ఆర్.రాజా, వెంకట సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

4న కడప కార్పొరేషన్ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప కార్పొరేషన్‌లో జరుగుతున్న చెత్త పన్ను వసూలు, కుక్కల ఆపరేషన్, ఫుట్ పాత్ వసూళ్లు, అడిషనల్ కార్మికుల సంఖ్య, వేతనాలపై నిజాయితీ గల అధికారి చేత సమగ్ర విచారణ జరిపించిచ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం కడప నగరంలోని మృత్యుంజయకుంటలో ఉన్న సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నుంచి వసూలు చేసే చెత్త పన్ను లు రద్దు చేసిందని, కానీ అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, వస్త్ర పరిశ్రమలు లాంటి వాణిజ్య, వ్యాపార సంస్థల నుంచి వసూలు చేస్తున్న చెత్త పన్ను వసూళ్లలో పెద్ద ఎత్తున అవినీతి చోటు చేసుకుందని తెలిపారు. ఈ అవినీతిలో చిన్న చౌక్ జోన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇరామియా, 2 టౌన్ జోన్ మార్కెట్ నాగ సుబ్బయ్య, లక్ష్మీ నారాయణ, శ్రీనివాసులు, సునీల్, 21వ డివిజన్ మేస్త్రీ రవితో పాటు దాదాపు 30 మంది శానిటరీ సెక్రటరీ, ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకంగా ఉందని తెలిపారు. వీరితో పాటు హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాత్ర కీలకంగా మారిందని, అతన్ని ఉద్యోగం నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పన్నులు భవన నిర్మాణ అనుమతులు, నీటి కొళాయి కనెక్షన్ల మంజూరులో నా పెద్ద ఎత్తున అవినీతి కొనసాగుతుందని తెలిపారు. దీన్ని అరికట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు 4న నిర్వహించే ఆందోళనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నగర కమిటీ సభ్యుడు చంద్రారెడ్డి, కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ నాయకులు

మహాసభను జయప్రదం చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కడప జిల్లా మొదటి మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. గురువారం ప్రెస్‌క్లబ్ ఎదుట కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు శ్రమ, వేతన దోపిడీకి గురవుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న ఆప్కాస్, అవుట్ సోర్సింగ్ కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. కనీస వేతనం కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. గతంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఎంటిఎస్ అమలయ్యేదని,2016 తర్వాత ఆ ఎంటిఎస్ అమలయ్యే విధానాన్ని అప్పుడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం జీవో నంబర్ 7 ను తీసుకుచ్చి కార్మికులను మరింత దోపిడీకి గురయ్యే విధంగా చేసిందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మరింత బానిసలుగా చేసేందుకు ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు. కడప జిల్లాకే తలమానికంగా ఉన్న జిజిహెచ్ లో 40 మంది రోగులకు ఒక్క శానిటేషన్ వర్కర్ ను మాత్రమే నియమిస్తున్నారని తెలిపారు. అంటే ఇక్కడ ముగ్గురి కార్మికుల శ్రమను ఒక కార్మికులతోనే చేపించడం చాలా అన్యాయం అన్నారు. ఈ నెల 3న కడప నగరంలో యుటిఎఫ్ ఆఫీస్ దగ్గర మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా మహాసభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మహాసభకు జిల్లాలో ఉన్న ఆప్కాస్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి. చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్.గోపి, జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ యూనియన్ నాయకులు సి.పి.రమణ, చిన్న రాయుడు, సోమిరెడ్డి, రమేష్ బాబు, రామసుబ్బారెడ్డి, వెంకటేష్, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పవన్, మెడికల్ యూనియన్ నాయకులు దస్తగిరి, కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లా డారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయిమెంట్స్ కల్పించాలని, మేజర్, మైనర్ డిగ్రీ విధానంలో కొనసాగుతున్న విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు జీవో నెంబర్ 77ను రద్దుచేసి, పీజీ విద్యార్థులందరికీ ఫీజు రాయితీ కల్పించాలని చెప్పారు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికీ అమలు చేసి ఎన్నికల హామీలు నెరవేర్చాలని వారన్నారు. సంక్షేమ ఆస్తులకు సొంత భవనాలు కేటాయించి వారి మెస్ ఛార్జీలను రూ. 3 వేలకు పెంచాలని, విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయాలని చెప్పారు. పట్టణంలో గవర్నమెంట్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల లేకపోవడం వల్ల విద్యార్థులందరూ ప్రయివేట్ కళాశాలలో ఫీజులు కట్టుకోక అవస్థలకు గురవుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలను ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్లీనరీ సందర్భంగా నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షులు

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తగదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప రూరల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ సారధి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఒక వైపు ప్రకటన చేస్తూనే మరో వైపు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల మేర స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా యూనిట్ ధర రూ. 2 నుంచి రూ.7 వరకు పెరుగుతుందన్నారు. ఈ ఆర్థిక భారం ప్రజల నెత్తిన వేయడం దారుణమన్నారు. గత వైసిపి ప్రభుత్వం కరెంటు ఛార్జీల రూపంలో రూ. 32 వేల కోట్లు అదనంగా ముక్కు పిండి వసూలు చేసిందని ఆరోపించారు. ఈ దోపిడీకి ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వానికి, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ పాల్గొన్నారు.

వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కమిషనర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి కమిషనర్ బంగ్లాలో పేకాట ఆడిన నలుగురు ఉద్యోగులపైన చట్టపైనమైన చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిఐ కి ఫిర్యాదు అందజేశారు. అలాగే క్లాప్ యూజర్ ఛార్జెస్ అక్రమ వసూళ్ల పైన జరుగుతున్న సమగ్ర విచారణ పూర్తి అయిన వెంటనే దోషులుగా తేలిన వారికి శాఖ పరమైన చర్యలు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు క్రమశిక్షణలో లేకపోతే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ పేర్కొన్నారు.

నాయకులతో ఇన్‌ఛార్జి మంత్రి మంతనాలు

ప్రజాశక్తి ఒంటిమిట్ట



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి

జడ్‌పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో గురువారం స్థానిక టిటిడి గెస్ట్ హౌస్‌లో అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి టిడిపి నాయకులతో సమావేశం అ య్యారు. ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో నామినేషన్ దాఖలు అవుతున్న సందర్భంగా టిడిపి తరుపున ఎవరిని అభ్యర్థిని నియమించాలని మంత్రి మండలంలోని ప్రధాన టిడిపి నాయకులతో చర్చించారు. జడ్‌పిటిసిగా నిలబడాలన్న నాయ కుల అందరితో విడివిడిగా మాట్లాడారు వారి ఆర్థిక స్థోమత, టిడిపిలో వారికున్న అనుభవాలు, ఎప్పటి నుండి పార్టీలో కొనసాగుతున్నారు వంటి వాటిపై మంత్రి ఆరా తీశారు. వైసిపి తరుపున ఇప్పటికే ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి నామినేషన్ దాఖలు చేసినందున టిడిపిలో కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనప్పటికీ నామినేషన్‌కు ఈనెల 1న చివరి రోజు కావడంతో టిడిపి తరపున ఎవరిని నిలబెడుతారని ఉత్కంఠ అటు ప్రజలోనూ, ఇటు నాయకు ల్లోనూ నెలకొంది. ఇదీలా ఉండగా మంత్రి మంతనాలు నిర్వహించిన తరు వాత సీనియర్ అడ్వకేటు, టిడిపి సీనియర్ నాయకులు బి. రామదాసు మం త్రితో వాగ్వాదానికి దిగారు. తాను చాలా ఏళ్ల నుంచి పార్టీలో ఉంటు న్నానని, గతంలోనూ జడ్‌పిటిసి స్థానానికి పోటీ చేశానని, తాను దళితుడనే నెపంతో పార్టీకి దూరంగా పెడుతున్నారని వాపోయారు. తనను ఏ ఒక్కరూ పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ఆస్తులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని పాత కడప మామిడి వీధిలో తమ పూర్వీకుల ఇంటి స్థలంలో తనకు తెలియకుండా తన సోదరుడు, ఆయన కుమారులు ఇల్లు కట్టుకుని అనుభవిస్తున్నారని, తనకు రావాల్సిన ఆస్తిని ఇవ్వకుండా మోసం చేశారని బాధితుడు మీసాల మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ఆస్తులను తనకు దక్కకుండా అక్రమంగా తన అన్న, ఆయన కుమారులు దోచుకున్నారని చెప్పారు. పొలంలో కూడా భాగం ఇవ్వ కుండా ఆన్‌లైన్ చేర్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ఉన్నత ధికారులు విచారణ జరిపి తనకు రావాల్సిన ఆస్తులను ఇప్పించాలని వేడుకున్నారు.

వర్ష ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆస్పత్రి ప్రారంభంలో డాక్టర్ శ్రీనివాసులు

నగరంలోని నాగ రాజుపేటలో అత్యాధునిక అధునాతన పద్ధతిలో నూతనంగా నిర్మించిన వర్ష హాస్పిటల్ గురువారం డాక్టర్ శ్రీనివాసులు సతీ సమేతంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేస్తామని తెలిపారు. పురిటి బిడ్డలు నుంచి 12 సంవత్సరాల లోపు పిల్లలకు అత్యాధునిక పరికరాలతో ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉందని చెప్పారు. అత్యవసర కేసులకు 24 గంటలు చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.


మ్యాథమెటిక్స్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో మొట్టమొదటిసారిగా జాహ్నవి హ్యాపీ అవర్స్ ప్లే స్కూలులో (ఎ యూనిట్ ఆఫ్ రిషి వ్యాలీ స్కూల్) మ్యాథమెటిక్స్ ల్యాబ్ ప్రారంభించామని డైరెక్టర్ జెవి అశోక్ గిరి తెలిపారు. గురువారం మ్యాథమెటిక్స్ ల్యాబ్‌ను హైదరాబాదుకు చెందిన ప్రజోద్వా ఎడ్యుకేషనల్ సొల్యూషన్ సిఇఒ వసుంధర ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ మొదటిసారి తమ స్కూలులో ల్యాబ్‌ను ప్రారంభించామని చెప్పేందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యంగా అన్ని తరగతుల వారికి మ్యాథమెటిక్స్ ల్యాబ్ విస్తరిస్తామని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీలో భాగంగా దీనిని తమ పాఠశాలలోకి తీసుకువచ్చామని చెప్పారు. సిఇఒ వసుంధర మాట్లాడుతూ కడపలో మొదటిసారి మ్యాథమెటిక్స్ ల్యాబ్‌ను ప్రారంభించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్న తరగతుల నుంచే బేసిక్ బాగా పడుతుందని తెలిపారు. ఎఐ టెక్నాలజీని అందిస్తామని చెప్పారు. విద్యార్థులు పరికరాలను ఉపయోగించి విద్యను నేర్చుకుంటారని, దీని ద్వారా పాఠ్యపుస్తకాలలోని అంశాలే కకుండా, ఇతర అంశాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చదవడం ద్వారా కొంత, ప్రాక్టికల్స్ ద్వారా మొత్తం విద్యార్థులు తెలుసుకొనే అవకాశం ఉందని చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇలాంటి అంశాల్లో ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.

ఎంఇఒ లిల్లమ్మ సేవలు అమోఘం


ప్రజాశక్తి - వల్లూరు : ఎంఇఒగా లిల్లమ్మ విద్యాభివృద్ధి చేసిన సేవలు అమోఘమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గురువారం ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో ఘనంగా సన్మా నించారు. ఎంఇఒ-2 పుత్త విజయరెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది సన్మానించి మాట్లాడారు. లిల్లమ్మ మండల విద్యాశాఖాధికారిగా పదేళ్ల పాటు బాధ్యతను చేపట్టి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం లిల్లమ్మ మాట్లాడుతూ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తనకు ఎంతో సహకరించారని వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వల్లూరు ఫేస్ వన్ మండల విద్యాశాఖ అధికారిగా ఎస్.నాగరత్న బాధితులు తీసుకున్నారు. కార్యక్ర మంలో ఎంఆర్‌సి సిబ్బంది ఓబయ్య, శైలజ, రాజా, విశ్వనాథ్ పాల్గొన్నారు.



లిల్లమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చెత్త పన్ను అవినీతిపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప నగరపాలక సంస్థలు చెత్త పన్ను వసూళ్లలో అవినీతిపై విచారణ చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్‌కు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి లేఖ రాశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ వేసి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు వెల్లడించారు. వైసిపి ప్రజా ప్రతినిధులు అవినీతికి పాల్పడడం, అధికారులను బలి చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. 2020 నుంచి చెత్త పన్ను వసూలు చేయడం ప్రారంభించారని పేర్కొన్నారు. ప్రారంభించిన సంవత్సరం నుంచి ఐదేళ్లలో పన్ను వసూళ్ల తగ్గుతూ వచ్చాయని, వైసిపి ప్రజా ప్రతినిధుల జేబులు నిండుతూ వచ్చాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది మాత్రమే అయిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్త పన్ను రద్దు చేశామని గుర్తు చేశారు. చెత్త పన్ను పేరుతో ఐదు సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం ప్రజలను దోపిడీ చేసిందని తెలిపారు. జెసి స్థాయి అధికారితో విచారణ చేయించడం ద్వారా ఎలాంటి ఒత్తిడిలకు తలోగ్గే పరిస్థితి ఉండదని చెప్పారు. ఐదు సంవత్సరాలలో ఎంత అవినీతికి పాల్పడ్డారో విచారణలో తేలుతుందని తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడి ఉంటే చట్టపరమైన చర్యలతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, సూర్యనారాయణ, జప్పుల్ల, బాలకృష్ణారెడ్డి, పాలకొండ దేవస్థానం చైర్మన్ రెడ్డి యాదవ్, 35వ డివిజన్ ఇన్‌ఛార్జి మన్సూర్ అలీ ఖాన్, టిడిపి నాయకులు జిలాని బాషా, శివారెడ్డి, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్న సిహెచ్ఒ దేవి

మహిళలు శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రుతుచక్ర పరిశుభ్రతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సిహెచ్ఒ దేవి సూచించారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆహారపు అలవాట్లు-వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం గర్భిణులు 40శాతం మంది రక్తహీనతతో బాధపడడంతోపాటు గర్భాశయ క్యాన్సర్‌కు గురవుతున్నారని తెలిపారు. రుతుక్రమం సమయంలో శుభ్రత ఉండాలని తెలిపారు. రక్తస్రావం అధికమైనప్పుడు రెండు ప్యాడ్లు ఒకేసారి వాడే బదులు ఒకొక్కటి వాడుట వల్ల ఇన్‌ఫెక్షన్ తగ్గుతుందని పేర్కొన్నారు. సబ్బుతో కాకుండా వేడి నీటితో శుభ్రం చేసుకోవడం మంచిదని సూచించారు. 2024లో దాదాపు నాలుగు లక్షల మంది గర్భాశయ క్యాన్సర్‌కు లోనైనట్లు తెలిపారు. విద్యార్థినులు అడిగిన వాటికి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు కిరణ్మయి, డాక్టర్ ఎల్.నాగలక్ష్మి దేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

3న జిల్లా స్థాయి అండర్-14,16 అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఆదివారం జిల్లాస్థాయి అండర్-14,16 బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు బసిరెడ్డి వీరకల్యాణ్‌రెడ్డి, ఫౌండేషన్ కార్యదర్శి అమర్‌బాషా తెలిపారు. ఆ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 3న ఉదయం 9 గంటలకు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆటస్థలంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 14ఏళ్లలోపు బాల బాలికలకు ట్రియాథ్లోన్ 60 మీ., లాంగ్ జంపు, హై జంపు, ట్రియాథ్లోన్ 60 మీ., లాంగ్ జంపు, బ్యాక్ త్రో, ట్రియాథ్లోన్ 60 మీ., లాంగ్ జంప్, 600 మీ., కిడ్స్ జావెలిన్, అండర్-16 విభాగంలో 60 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, జావలిన్ త్రో క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కడప జిల్లా వారు అర్హులన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 9,10,11 తేదీల్లో బాపట్లలో నిర్వహించే స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ఎంపిక అవుతారని తెలిపారు. విజేతలకు ప్రశంసాపత్రాలు బహూకరిస్తారని పేర్కొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా ఉపయోగించాలో సూచిస్తున్న డాక్టర్ ఇందిర

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిరా పేర్కొన్నారు. గురువారం ప్రొద్దుటూరు వెటర్నరీ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గోపవరం పాఠశాలలో ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇందిర మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందడమే కాకుండా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పాఠశాల పరిసరాలను శుభ్రంగా, పర్యావరణహితంగా మార్చుకోవచ్చని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వ్యర్థాలను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చే పద్ధతులు నేర్చుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ట్రైబల్ ఫెడరేషన్ నాయకులు

కనీస అవసరాలకు నోచని గిరిజన కాలనీ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు వీరాపురం గిరిజన కాలనీలో కనీస వసతులు కూడా లేవని ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లబోతుల కొండయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు ఇంటి స్థలాలు, ఇళ్లు, పెన్షన్లు, సిమెంట్ రోడ్లు వంటి కనీస పథకాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలనీ వాసులకు వసతులు కల్పించాలన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శైలజ, ప్రజలు పాల్గొన్నారు.

కంపు భరించలేకున్నాం..!

శుభ్రం చేయండి బాబోయ్ అంటూ వేడుకుంటున్న శ్రీరాంనగర్ వాసులు

ప్రజాశక్తి - వేంపల్లె



శ్రీరాం నగర్ డ్రెయినేజీ కాలువలో నిలిచిపోయిన మురుగు నీరు

కంపు భరించలేకున్నాం.. శుభ్రం చేయండి బాబోయ్ అంటూ స్థానిక గండి రోడ్డులో ఉన్న శ్రీరాంనగర్ వాసులు వేడుకుం టున్నారు. అయినా పంచాయతీ అధికారులు, సిబ్బందిగాని స్పందించడం లేదు. కొన్ని రోజులుగా వేంపల్లె గండి రోడ్డులో ఉన్న శ్రీరాంనగర్ ప్రాంతంలో డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురికి నీరు నిలిచి భరించలేని దుర్వాసనను వెదజల్లుతోందని స్థానికులు అల్లాడి పోతున్నారు. కంపు, దోమలతో తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నామని వాపోతున్నామని ఆప్రాంత వాసి యుగంధర్ అవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు పంచాయతీ అధికారికి, పారిశుధ్య మెస్త్రీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. మురికి నీరు నిలిచి పోవడంతో ఆ ప్రాంతలో ఉన్న ప్రజలు వీధిలో తిరగాలన్నా రోడ్డుపై నిలిచిపోయిన మురికి నీటిలోనే అడుగు పెట్టాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. మురికినీటిలో అడుగు పెట్టి వెళ్లే వారు ఇప్పటికే ముగ్గురు కాలు జారీ కింద పడి గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. వేంపల్లె పంచాయతీలో ఇంతమంది అధికార, ప్రతిపక్ష నాయకులు ఉండి పారిశుధ్యంపై దృష్టి పెట్టలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి : సిపిఎం



కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సోలార్ ప్రాజెక్టు కోసం కల్వటాల, గోవిందపల్లి తదితర గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని 2013 భూ చట్టం అమలు చేయాలని జమ్మలమడుగుకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజా సంఘాలు బహిరంగ లేఖ రాశాయి. గురువారం ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ కరపత్రాలను స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సిఐటియు నాయకులు ఏసుదాస్, దాసరి విజయ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల శివనారాయణ మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ పేరుతో రైతుల నుండి బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని సోలార్ ప్లాంట్ యాజమాన్యం రైతుల దగ్గర బలవంతపు సేకరణ చేయడం, భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం చాలా దుర్మార్గమన్నారు. లీజు పేరుతో రైతుల దగ్గర తీసుకున్న భూములు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్‌లో భూములు కోల్పోతున్న గ్రామాలలో రస్తాలు కూడా ఆక్రమించుకోవడం చాలా అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు పోయే రహదారులను యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా రాత్రి సమయాల్లో బల వంతంగా గుంతలు తీసి స్తంభాలు ఏర్పాటు చేయడం సరైందికాదన్నారు. శుక్రవారం జమ్మలమడుగుకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో సోలార్ బాధితుల పక్షాన మాట్లాడాలని, బాధిత రైతు కుటుంబాలకు అండగా నిలబడాలని వారు కోరారు. సోలార్‌లో నష్టపోయిన బాధిత రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం కోసం రైతు సంఘం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అబ్రహం, రమేష్, బాషా, ప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం కెసి రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కెసి కాలువ చివరి ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. కాలువకు సాగునీటిని విడుదల చేసి దాదాపు మూడు వారాలు కావొస్తున్నా చివరి ఆయకట్టుకు నీరు సక్రమంగా అందలేకుంది. వివరాల్లోకి వెళితే.. ఏటూరు కాలువకు ఇటీవలే సాగు నీటిని విడుదల చేశారు. కాలువ ప్రారంభంలో నీటి ప్రవాహం జోరుగా కొన సాగుతున్నా, చివరి వరకు వెళ్లేసరికి నీటి ప్రవాహం నెమ్మదిగా సాగుతోంది. కాలువలో వ్యర్థాలు, కంపచెట్లు, పూడిక వంటి వాటి వల్ల ప్రవాహం వేగాన్ని పుంజుకోలేక పోతోంది. ఈ నేపథ్యంలో చివరి ఆయకట్టు ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. కెసి కాలువలను పర్యవేక్షించాల్సిన అధికారులు కాలువల వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఏటూరు కాల్వ పరిధిలో వందలాది ఎకరాలు వరి పంటను సాగు చేస్తుంటారు. ప్రతి ఏటా సాగునీరు ఆలస్యంగా తమకు అందుతోందని ఆ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కాస్త ముందుగా కాలువలకు నీరు వచ్చినా తమకు ఏమాత్రం ప్రయోజన లేదని రైతులు వాపోతున్నారు. ఏటూరు కాలువకు నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



ఏటూరు కాలువలో నెమ్మదిగా సాగుతున్న నీరు

అధ్వానంగా జడ్జిగారికొట్టాలు-సిద్ధారెడ్డిపల్లి రోడ్డు



ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని జడ్జిగారి కొట్టాలు నుండి సిద్ధారెడ్డిపల్లి గ్రామం వరకు దారి చాలా అధ్వానంగా ఉంది. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి జడ్జిగారి కొట్టాలు వద్ద నుంచి సిద్ధారెడ్డి పల్లి గ్రామానికి గ్రావెల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు కొంతకాలంగా మరమ్మతులకు నోచుకోక గుంతల మయంగా మారింది. కంకర బయట పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డుకు సంబంధించిన వాహనాలు అధికంగా తిరుగుతూ ఉండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డును బాగు చేయాలని కొన్నేళ్లుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.3 కోట్లతో టెండర్లు కూడా ఆహ్వానించారు. కాంట్రాక్టరు పనులు ప్రారంభించకపోవడంతో ఆ టెండర్‌ను రద్దు చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి. సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, మొర్రాయిపల్లె తదితర గ్రామ ప్రజలు మైదుకూరు, దువ్వూరు, చింతకుంట ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ద్వారకానగరం గ్రామ ప్రజలు సచివాలయం, ఇతర అవసరాల కోసం సిద్ధారెడ్డిపల్లి పంచాయతీలోకి రావాల్సి ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా పెన్నా వంతెనపై గుంతలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ఖాజీపేట-చెన్నూరు మధ్య ఉన్న పెన్నా వంతెనపై పలుచోట్ల ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. వంతెనపై పిల్లర్ల మధ్యన ఈ గుంతలు చోటుచేసుకున్నాయి. పెన్నా నది పాత వంతెనపై ఈ పరిస్థితి నెలకొందని వాహనదారులు పేర్కొంటున్నారు. రాత్రివేళ ప్రయాణించే వాహనదారులు గుంతల బారినపడి ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారి విభాగ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని వాహనదారులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రతినిత్యం ఈ మార్గంలో వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బడి సమీపంలో మద్యం దుకాణం వద్దని నిరసన

ప్రజాశక్తి - చాపాడు



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

మండల పరిధిలోని అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలో నూతనంగా మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం తగదని ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొన్నారు. చాపాడు మండలానికి మంజూరైన రెండు మద్యం దుకాణాల్లో ఒకటి చాపాడులో ఏర్పాటు చేశారు. రెండవ దుకాణాన్ని ఇప్పటి వరకు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం నిర్వాహకులు అన్నవరంలో ఏర్పాటు చేశారు. అయితే పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉండడంతో వారు నిరసన తెలిపారు. ఆ మేరకు గ్రామస్తులు హైస్కూల్ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసి మద్యం దుకాణాన్ని తొలగించాలని కోరారు. వెంటనే ఆయన స్పందించి పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం దుకాణాన్ని వెంటనే ఆ మార్గంలో తొలగించాలని అధికారులను



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎన్‌జిఒ నాయకులు

ఎన్‌జిఒ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు తాలూకా ఎపి ఎన్‌జిఒ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఆ మేరకు గురువారం వారు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మైదుకూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు గజ్జల చంద్రమౌళి మాట్లాడుతూ మైదుకూరు తాలూకా యూనిట్‌కు ఎన్‌జిఒ భవనానికి స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఉద్యోగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాచనూరు రాఘవయ్య, కోశాధికారి లక్కినేని బాబు, ఉపాధ్యక్షులు రాజన్న, పెంచల్ రెడ్డి, గురుప్రసాద్, మేరీ సువర్ణ, సంయుక్త కార్యదర్శులు రామగుప్తా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'ను కలిసిన ఎంపిపి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను గురువారం ఎంపిపి సి.వీరనారాయణరెడ్డి ఆయన సోదరులు సింగిల్‌విండో మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, మల్లేపల్లి ఉపసర్పంచ్ కొండారెడ్డి ఆయన కుమారులు కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛమిచ్చారు.

'అన్నదాత సుఖీభవ'పై ఆంక్షలు పెట్టొద్దు

ప్రజాశక్తి - వేంపల్లె



ఎన్.తులసిరెడ్డి

అన్నదాత సుఖీభవ పథకం అమలులో కూటమి ప్రభుత్వం ఆంక్షలు పెట్టవద్దని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలస్యంగానైనా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈనెల 2నుంచి అమలు చేయాలని నిర్ణయించడం హర్షణీయమన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థికసాయం చేస్తామని కూటమి పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు చెప్పారు. ఆ ప్రకారమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద ప్రభుత్వం రైతులకు ఆర్థికసాయం చేయలేదని తెలిపరు. ఆ మొత్తాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థికసాయంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయాలన్నారు. డికెటి భూములు, చుక్కల భూముల రైతులకు కూడా వర్తింపజేయాలని కోరారు. 2024 జనవరిలో రైతు భరోసా కింద 53.58 లక్షల మంది రైతుల ఖాతాలో జమ అయ్యిందని చెప్పారు. ప్రస్తుతం 46.50 లక్షల మంది రైతుల ఖాతాలో మాత్రమే నగదు జమ చేస్తున్నామని ప్రభుత్వం చెప్పడం గర్హనీయం అన్నారు. కూటమి ప్రభుత్వం చెబుతున్న విధంగా చూస్తే 7.08 లక్షల మంది రైతుల సంఖ్య తగ్గుతుందని వివరించారు. ఇది సమంజసం కాదన్నారు. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల సంఖ్య తగ్గకూడదని పేర్కొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు


నోటీసులు కాదు.. చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామం రాజీవ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులచే పనులు చేయించిన ఉపాధ్యాయులుపై చర్యలు తీసుకోవాలని, నోటీసులతో సరిచేయవద్దని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక పతంగి రామన్న పాఠశాలలో గురువారం ఎంఇఒలు చంద్రశేఖర్‌రావు, మోహన్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత మంగళవారం వేమగుంటపల్లి గూడెంచెరువు గ్రామం రాజీవ్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఓబయ్య, జహీర్ బాషా ఉపాధ్యాయులు స్కూల్‌లో విద్యార్థులచేత పార పట్టించి మట్టి మోపించడంతో వారిపై నోటీసులు ఇచ్చి, వివరణ ఇవ్వాలని కోరడం సరైంది కాదన్నారు. ఉపాద్యాయులు ఇలా ఉంటే తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలంటే ఆలోచిస్తారని అన్నారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయాన్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - సింహాద్రిపురం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఖాదర్‌బాషా

మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఇఒ-1 పూల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఆయన ఎంఇఒ-1 గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన అహోబిలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఖాదర్ బాషాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంఇఒ-1 ఓబులేసు కొండా పురం ఎంఇఒ-1గా పనిచేయనున్నారు. ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ మండలంలో విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందించడంతోపాటు, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు నూతన ఎంఇఒను అభినందించారు.

బస్ షెల్టర్ ఉన్నా.. ప్రయాణికులకు ఉపయోగం లేదన్నా

ప్రజాశక్తి - ఖాజీపేట



బస్‌షెల్టర్‌లో కాలక్షేపం చేస్తున్న ప్రజలు

ఖాజీపేట బస్టాండ్ కూడలిలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్లు వారికి ఉపయోగపడడంలేదు. అక్కడ కొంత మంది కాలక్షేపానికి కుర్చీలపై కూర్చుంటున్నారు. ప్రయాణికులు మాత్రం బస్సుల రాక కోసం నిలవాల్సి వస్తోంది. ప్రజలు అక్కడ కూర్చోవడం వల్ల విద్యార్థినులు, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుపై నిలవాల్సి వస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం మరికొన్ని ప్రదేశాల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని కూడా కొందరు తమ టీ దుకాణాల వద్దకు మార్చుకున్నారు. నిజమైన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన వాటిపై వారే కూర్చొనేలా చూడాలని పలువురు కోరుతున్నారు.